క్లుప్తంగా

పోతిరెడ్డిపల్లిలో గ్రామస్తుల ధర్నా



ఆందోళన చేస్తున్న పోతిరెడ్డిపల్లి గ్రామస్తులు

చేర్యాల(సిద్దిపేట): సిద్దిపేట నుంచి యాదాద్రికి వెళ్లే బస్సు మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి మీదుగా నడపాలని కోరుతూ మంగళవారం గ్రామస్తులు పోతిరెడ్డిపల్లి క్రాస్ రోడ్డు వద్ద రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా గ్రామానికి బస్సు రావడం లేదన్నారు. గ్రామస్తుల ఆందోళన విషయాన్ని కండక్టర్, డ్రైవర్ సిద్దిపేట డీఎం దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి బస్సును పోతిరెడ్డిపల్లి మీదుగా వెళ్లాలని ఆదేశించారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

లక్కీ డ్రా విజేతలకు బహుమతులు



బహుమతిని అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

హుస్నాబాద్: దేవి శరన్నవరాత్రుల సందర్భంగా పట్టణంలోని గాంధీ చౌరస్తాలో నెలకొల్పిన దుర్గామాత మండపంలో అమ్మవారికి భక్తులు పూజలు చేస్తున్నారు. ప్రతీరోజు సాయంత్రం మండపం వద్ద లక్కీ డ్రా తీస్తూ బహుమతులు అందజేస్తున్నారు. మంగళవారం నిర్వహించిన లక్కీ డ్రా విజేత వనజకు మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత చేతుల మీదుగా వెండి నాణాన్ని బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి జ్యోతి, కొండూరి పద్మ, మంజుల, శ్రీదేవి, భవానీ, స్వప్న, అనిత, లక్ష్మి, ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

మా భూమి ఇవ్వకుంటే ఊరుకోం

నర్సయపల్లి గ్రామ దళితులు



ధర్నా చేస్తున్న దళితులు

మద్దూరు(హుస్నాబాద్): 60 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వంలో దళితులకు ఇచ్చిన భూమిలో సర్పంచ్ అక్రమంగా ప్రకృతి వనం ఏర్పాటు చేశారని ఆరోపిస్తూ మంగళవారం నర్సయపల్లి గ్రామ దళితులు పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిమ్మ హయంలో దళితులకు ఇచ్చిన భూమిలో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారన్నారు. తమ భూమికి బదులుగా మరోచోట భూమి ఇస్తానని నమ్మించి మోసం చేశారని మండిపడ్డారు. సర్పంచ్‌ను ఎన్నిసార్లు అడిగినా ఆయన పట్టించుకోవడంలేదన్నారు. తమ భూమిని తీసుకోవడమేకాకుండా అక్రమ కేసులు పెట్టి బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు భూములు ఇచ్చే వరకు ఊరుకోబోమన్నారు.

పత్తిలో అధిక సాంద్రత మేలు



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ రాజు

మర్కూక్(గజ్వేల్): అధిక సాంద్రత పద్ధతిలో పత్తి పంటలను సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని భారతదేశ పత్తి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజు తెలిపారు. మంగళవారం మండలంలోని చేబర్తి గ్రామంలో రైతు అశోక్ సాగుచేస్తున్న పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కూలీల కొరత అధిగమించాలంటే విత్తనం విత్తినప్పటి నుంచి పత్తి తీసేవరకు యాంత్రీకరణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. వంగడాల పంట కాలం తక్కువగా ఉండటంవల్ల కాయల పూత 20 నుంచి 30 వరకు వస్తుందని తెలిపారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగేందర్ రెడ్డి, శాస్త్రవేత్తలు రవికుమార్, రాశీ కంపెని ప్రతినిధులు మనోజ్, బలరాం, వ్యవసాయ విస్తరణ అధికారి రజినీకాంత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లోని లక్ష్మీప్రసన్నకాలనీలో అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

అన్నపూర్ణాదేవిగా దుర్గామాత

శ్రీ దేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు అన్నపూర్ణా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండపాల్లో కొలువైన అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన, అభిషేకాలు తదితర పూజలు చేశారు. మండపాల నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.





చిన్నకోడూరు(సిద్దిపేట): సికింద్లాపూర్‌లో పూజలు నిర్వహిస్తున్న భక్తులు,
(ఇన్‌సెట్) కొండపాక(గజ్వేల్): మర్పడ్గలోని విజయదుర్గ క్షేత్రంలో గాయత్రీ మాతగా దుర్గాదేవి

డివిజన్ చేస్తానన్న కేసీఆర్‌కు ధన్యవాదాలు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ స్వరూపరాణి

మున్సిపల్ చైర్ పర్సన్ స్వరూప రాణి

చేర్యాల(సిద్దిపేట): జనగామ నియోజకవర్గ కేంద్రంలో సోమవారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో చేర్యాల రెవెన్యూ డివిజన్ చేస్తానని ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూప రాణి తెలిపారు. మంగళవారం పట్టణ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జనగామ సభలో ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అభ్యర్థన మేరకు చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తానని వాగ్దానం చేసిన సీఎం కేసీఆర్‌కి పట్టణ ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. రెవెన్యూ డివిజన్ ఇచ్చేది కేసీఆర్, తెచ్చేది పల్లా రాజేశ్వర్‌రెడ్డేనని, ఇప్పటికైనా ప్రతిపక్ష పార్టీలు రాద్ధాంతం చేయడం మానుకోవాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, పచ్చిమడ్ల సతీష్, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, అధికార ప్రతినిధి మంచాల కొండయ్య, క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు ఇన్నారెడ్డి, జాయింట్ సెక్రటరీ బురగోని తిరుపతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనగామలో బీజేపీని గెలిపిద్దాం

జేఏసీ చైర్మన్ చక్రధారి

చేర్యాల(సిద్దిపేట): జనగామలో బీజేపీని గెలిపించేందుకు కృషి చేద్దామని జేఏసీ చైర్మన్ భైరవబట్ల చక్రధారి అన్నారు. చేర్యాల ప్రాంత ప్రజల సమస్యలు, హక్కుల కోసం పోరాటాలు చేసిన ఆయన మంగళవార బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈటల రాజేందర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతోపాటు చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట, జనగామ ప్రాంతాలకు చెందిన నాయకులు కూడా చేరారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేష్, మహిళా మోర్చా నాయకులు ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఈటల రాజేందర్

లక్కీ డ్రా తేదీల్లో మార్పులు

హుస్నాబాద్: బతుకమ్మ, దసరా పర్వదినాలను పురస్కరించుకొని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి అందించనున్న బహుమతి అందజేత తేదీల్లో మార్పులు చేసినట్లు ఆర్టీసీ కరీంనగర్ రీజనల్ మేనేజర్ సుచరిత మంగళవారం తెలిపారు. తొలుత ఈనెల 21 నుంచి 23, 28 నుంచి 30వ తేదీ వరకు ప్రయాణించే వారికి మాత్రమే నగదు బహుమతి వర్తిస్తుందని ప్రకటించామని, ఈ అవకాశం 18 నుంచి 30వ తేదీ వరకు వర్తిస్తుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రధాన బస్ స్టేషన్‌లలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా డ్రాప్ బాక్స్‌లు ఏర్పాటుచేశామన్నారు. టికెట్ వెనుక తమ పేరు, ఫోన్ నంబర్ రాయాలని సూచించారు. పై తేదీల్లో ప్రయాణానికి ముందస్తు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు కూడా అర్హులేనన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గూడెం పవనసుత యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా యాలాల పర్శ రాములు, అధ్యక్షుడిగా దొంతి హరీష్, ఉపాధ్యక్షుడిగా భీంరెడ్డి అమరేందర్‌రెడ్డి, గూడెల్లి సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా యాలాల శివకుమార్, కోశాధికారిగా వెంకటేష్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి మండల కేంద్రంలో రోడ్డు డివైడర్ల మధ్య విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నందున బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. వినియోగదారులు గమనించాలన్నారు.



ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

బెజ్జంకి(సిద్దిపేట): సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే పత్తి కొనుగోలు కేంద్రాలలో పత్తిని విక్రయించాలంటే రైతులు తమ బ్యాంకు ఖాతాలు ఆధార్ కార్డుతో అనుసంధానం చేసుకోవాలని ఆత్మ అధికారి సాయిచరణ్ మంగళవారం తెలిపారు. ఆధార్ లింక్ లేనివారు మీ సేవా కేంద్రాలలో అనుసంధానం చేసుకోవాలని పేర్కొన్నారు.

నాన బియ్యం సమర్పణ



బతుకమ్మ వేడుకల్లో మహిళలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బతుకమ్మ పండుగ ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బతుకమ్మకు నానబియ్యాన్ని నైవేద్యంగా సమర్పించారు. మంగళవారం మహిళలు, యువతులు బతుకమ్మ ఆడుతూ పాటలు పాడారు. అనంతరం బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేశారు. మహిళలు వాయినాలు ఇచ్చుకున్నారు.

రాజకీయంగా చైతన్యం కావాలి

మిరుదొడ్డి(దుబ్బాక): మాదిగలు రాజకీయంగా చైతన్యం కావాల్సిన అవసరం ఉందని ఎమ్మార్పీఎస్ టీఎస్ నాయకుడు ముత్యాల భూపాల్ అన్నారు. మండల పరిధిలోని కాసులాబాద్‌కు చెందిన భూపాల్ గతంలో మంజీర దళిత సేవా సమితి, తదితర సంఘాల్లో పనిచేశారు. మంగళవారం ఎమ్మార్పీఎస్ టీఎస్‌లో చేరారు. తనకు పదవీ బాధ్యతలు అప్పగించిన జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ మాదిగ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష ఓట్లకుపైగా మెజార్టీయే లక్ష్యం కావాలి

- మూడోసారి సీఎంగా కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు
- కేసీఆర్‌పై రూపొందించిన పాటల సీడీ ఆవిష్కరణ



పాటల సీడీని ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్: మూడోసారి సీఎంగా కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖామాత్యులు హరీశ్‌రావు అన్నారు. గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నేతలు దేవీ రవీందర్, మర్కూక్ కరుణాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో కేసీఆర్‌పై రూపొందించిన పాటల సీడీని మంగళవారం సిద్దిపేటలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ ప్రాతినిధ్యం గజ్వేల్ నియోజకవర్గానికి వరమన్నారు. సీఎం చొరవ ఫలితంగా గజ్వేల్ నేడు రాష్ట్రంలోనే అభివృద్ధికి నమూనాగా మారిందన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కేసీఆర్‌కు లక్ష ఓట్లకుపైగా మెజారిటీని సాధించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సందర్భంలో ప్రజలను చైతన్యవంతుల్ని చేసేందుకు దేవీ రవీందర్, కరుణాకర్‌రెడ్డి పాటల సీడీని రూపొందించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ గజ్వేల్ మండల అధ్యక్షుడు బెండె మధు, నాయకులు పండరి రవీందర్‌రావు, సంతోష్‌రెడ్డి, తోట శీను తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

దుబ్బాక: బీఆర్ఎస్, బీజేపీతో ఒరిగేది శూన్యమని, ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందని దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దుబ్బాకలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆత్మగౌరవ యాత్ర నిర్వహించారు. ఇంటింటి ఎన్నికల ప్రచారం చేస్తూ పార్టీ మేనిఫెస్టోలోని ఆరు అంశాలను ఓటర్లకు వివరించారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప నియోజకవర్గ ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. దుబ్బాకను అభివృద్ధి చేసిన ఘనత దివంగత మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం గంభీర్‌పూర్, అక్బర్‌పేటకు చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

భారీ మెజార్టీతో విజయం సాధిస్తా

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

రాయపోలు(దుబ్బాక): వచ్చే ఎన్నికల్లో మరో మారు భారీ మెజార్టీతో గెలుపొందుతానని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మండలంలోని ఆరెపల్లికి చెందిన పలువురు వార్డు సభ్యులు, ఆయా పార్టీల కార్యకర్తలు మంగళవారం బీజేపీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వంపై ప్రజలు విరక్తితో ఉన్నారని, బీజేపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. తొమ్మిదేళ్లు ఎంపీగా ఉన్నా దుబ్బాక ప్రాంతానికి ఏమీ చేయని కొత్త ప్రభాకర్‌రెడ్డి కొత్తగా చేసేదేమీ లేదన్నారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మంకిడి స్వామి, నాయకుడు కృష్ణ తదితరులున్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రఘునందన్‌రావు

బతుకమ్మ ఘాట్లను ఏర్పాటు చేయాలి

హుస్నాబాద్‌రూరల్: బతుకమ్మ పండగ సందర్భంగా ఘాట్లను ఏర్పాటు చేయాలని డీఎల్పీఓ వీరభద్రయ్య అన్నారు. మంగళవారం పోతారం(ఎస్), వంగరామయ్యపల్లి, మీర్జాపూర్, భల్లునాయక్‌తండా గ్రామాలను సందర్శించి పంచాయతీ రికార్డులను పరిశీలించారు. వందశాతం పన్నులు వసూలు చేస్తేనే పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని, వీటితో మౌలిక వసతులు కల్పించవచ్చన్నారు. క్రీడాప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలను పరిశీలించి అసంపూర్తి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీఓ సత్యనారాయణ, కార్యదర్శి ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మృతి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం ముద్దాపూర్ గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తూం అంజిరెడ్డి(65) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన రెండు పర్యాయాలు కుకునూరుపల్లి గ్రామ మాజీ సర్పంచ్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు, కోఆపరేటివ్ డైరెక్టర్‌గా పనిచేసి ప్రజల మన్ననలు పొందారు. అంజిరెడ్డి భార్య ఉమా ముద్దాపూర్ గ్రామ సర్పంచ్. ఈమె కూడా మూడు నెలల కిందట మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసిందే. ఎమ్మెల్సీ యాదవరెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, ఎస్ఐ పుష్పరాజ్, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ అంజిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

సంక్షిప్త వార్తలు

◆ **బాధిత కుటుంబాలకు చేయూత**

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామంలో ముగ్గురు పారిశుద్ధ్య కార్మికులు ప్రమాదవశాత్తు బతుకమ్మ చెరువులోపడి మృతి చెందిన విషయం తెల్సిందే. మంగళవారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మృతుల కుటుంబాలను పరామర్శించారు. యాదమ్మ, భారతి కుటుంబాలకు రూ.6 వేల చొప్పున, బాబు కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు మల్లేశం, ప్రధాన కార్యదర్శి నరేందర్, మాజీ అధ్యక్షుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్ గెలుపు ఖాయం**

చేర్యాల(సిద్దిపేట): త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కడవేర్గు గ్రామంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయా పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

◆ **చిన్న మల్లయ్యకు నివాళి**

హుస్నాబాద్: తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం, బీసీ సంఘాల ఆధ్వర్యంలో దివంగత మాజీ ఎమ్మెల్యే దేశిని చిన్నమల్లయ్య 92వ జయంతిని మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు చినమల్లయ్య సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పచ్చిమట్ల రవీందర్ గౌడ్, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



◆ **బీఆర్ఎస్‌కు మద్దతుగా తీర్మానం**

చిన్నకోడూరు(సిద్దిపేట): రానున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్న మంత్రి హరీశ్‌రావుకు మండల పరిధిలోని చర్లఅంకిరెడ్డిపల్లి గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యులు మద్దతుగా మంగళవారం ఏకగ్రీవ తీర్మానం చేసి ఆ పత్రాన్ని మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం సభ్యులు మాట్లాడుతూ మంత్రి కృషి వల్లే సిద్దిపేట నియోజకవర్గం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. విద్య, వైద్య రంగాలతోపాటు రంగనాయక సాగర్ నిర్మాణంతో ఈ ప్రాంతం పచ్చని పంట పొలాలతో కళకళలాడుతోందన్నారు.

◆ **నూతన నియామకాలు**

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ సమక్షంలో మండల ప్రధాన కార్యదర్శులుగా లింగాల లక్ష్మణ్, చెలుకల నరేందర్‌రెడ్డిను నియమిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్‌లో చేరికలు**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుండారం గ్రామానికి చెందిన ఫాక్స్ డైరెక్టర్, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, పలువురు నాయకులు మంగళవారం కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపెల్లి సత్యనారాయణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ **స్థానికులతోనే మానకొండూర్ అభివృద్ధి**

బెజ్జంకి(సిద్దిపేట): మానకొండూర్ నియోజకవర్గ అభివృద్ధి స్థానికులకు అవకాశం లభించనప్పుడే సాధ్యపడుతుందని మాజీ ప్రభుత్వ విప్, బీజేపీ నాయకుడు ఆరెపల్లె మోహన్ పేర్కొన్నారు. బీజేపీలోచేరిన మొదటిసారిగా మంగళవారం బెజ్జంకి వచ్చిన ఆయనను మండల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల జగన్‌రెడ్డి, ఆయా మండలాల పార్టీల అధ్యక్షుడు దోనె అశోక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రజా ఆశీర్వాద సభలో వినతి**

అక్కన్నపేట(హుస్నాబాద్): గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్, మేరమా యాడి దేవాలయ నిర్మాణానికి రూ.50 కోట్లు, పది ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించాలని కోరుతూ ఇటీవల హుస్నాబాద్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం అందజేసినట్లు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మాలోతు భీలునాయక్ మంగళవారం తెలిపారు. రాష్ట్రంలో సేవాలాల్ మహారాజ్, మేరమా యాడి దేవాలయం లేక మహారాష్ట్రంలోని పొరాలో, అనంతపురం గుత్తి బళ్లారి జిల్లాలో ఉన్న ఆలయాలకు వెళ్లావస్తోందన్నారు. తమ విజ్ఞప్తికి సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించారని, అధికారంలోకి రాగానే దేవాలయ నిర్మాణాలు ప్రారంభిస్తామని చెప్పినట్లు తెలిపారు.

◆ **ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొడతాం**

అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రాజెక్టుపై ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్తామని మాజీ జెడ్పీటీసీ మాలోతు భీలునాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ వెనుక ఉండి ఎన్జీటీలో కేసులు వేయించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపనలు చేశారని, అప్పుడేందుకు పర్యావరణ అనుమతులు తీసుకోలేదో సమాధానం చెప్పాలని కాంగ్రెస్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌కు సవాల్ విసిరారు. గోదావరి జలాలతో మొట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే సతీష్‌కుమార్ కృషి చేస్తుంటే కొంతమంది అడ్డుపడుతున్నారని మండిపడ్డారు.

◆ **రెడ్డి కార్పొరేషన్ హామీ ఏమైంది?**

చిన్నకోడూరు(సిద్దిపేట): రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ఎందుకు అమలు చేయలేదని రెడ్డి జాగృతి రాష్ట్ర కార్యదర్శి యాళ్ల లింగారెడ్డి ప్రశ్నించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీలను విస్మరించిన బీఆర్ఎస్ పార్టీ మళ్లీ కొత్త వాగ్దానాలతో ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో రెడ్డి కులస్తులు, యువత చాలా నష్టపోయారన్నారు. అన్ని పార్టీలు రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుపై స్పందించాలని, లేని పక్షంలో ప్రచారాల్లో నాయకులను నిలదీస్తామని హెచ్చరించారు

◆ **రాజకీయ ప్రకటనల తొలగింపు**

హుస్నాబాద్‌రూరల్: తెలంగాణ శాసనసభ ఎన్నికలకు షెడ్యూల్ రావడంతో అయా గ్రామాల్లో గోడలపై రాజకీయ పార్టీల ప్రకటనలు, గుర్తులను ఎన్నికల అధికారుల లాదేశాల మేరకు తొలగిస్తున్నారు. మంగళవారం తోటపల్లి గ్రామంలో ప్రధాన రహదారుల్లోని గోడలపై ఉన్న రాజకీయ పార్టీల గుర్తులు, సందేశాలపై పంచాయతీ సిబ్బంది పెయింట్ వేశారు.

◆ **ఆర్థిక సాయం**

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని రేబర్తి గ్రామానికి చెందిన పెద్దింటి యాదయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి మంగళవారం సర్పంచ్ సబిత రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.